# పసిడి.. పరుగో పరుగు

## ఒక్కరోజే రూ.1,130 ఎగిసిన తులం ధర

## రికార్డు స్థాయిలో రూ.67,450కి 10 గ్రాములు



న్యూఢిల్లీ, మార్చి 21: బంగారం ధర ఒక్కసారిగా ఎగిసింది. దీంతో గురువారం మరో సరికొత్త స్థాయికి చేరింది. ఢిల్లీ స్పాట్ మార్కెట్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ పసిడి ధర రూ.1,130 ఎగబాకి ఆల్‌టైమ్ హైని తాకింది. మునుపెన్నడూ లేనివిధంగా రూ.67,450 వద్ద నిలిచింది. హైదరాబాద్‌లోనూ రూ.1,090 పుంజుకొని రూ.67,420 వద్ద ఉన్నది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్.. ఈ ఏడాది వడ్డీరేట్లను తగ్గిస్తుందన్న అంచనాలు బలంగా ఉన్న నేపథ్యంలో మదుపరులు తమ పెట్టుబడులను గోల్డ్‌వైపునకు మళ్లిస్తున్నారు. ఏవైనా ఒడుదొడుకుల నుంచి తమ ఇన్వెస్ట్‌మెంట్లకు రక్షణగా గోల్డ్‌నే ఎంచుకుంటున్నారు మరి. ఈ క్రమంలోనే రేట్లు ఇంతలా పెరిగాయని మార్కెట్ నిపుణులు తాజా ట్రేడింగ్ సరళిని విశ్లేషిస్తున్నారు.

### గ్లోబల్ మార్కెట్‌లో..

అంతర్జాతీయ మార్కెట్లలోనూ పుత్తడి ధరలు పరుగులు పెడుతున్నాయి. ఔన్సు 2,202 డాలర్లు పలికింది. ఒక్కరోజే ఏకంగా 48 డాలర్లు పెరగడం విశేషం. అయితే భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలకుతోడు ఆయా దేశాల సెంట్రల్ బ్యాంకులు గోల్డ్‌ను విపరీతంగా కొనేస్తుండటం కూడా ఇందుకు కారణమని ట్రేడర్లు అభిప్రాయపడుతున్నారు. భారతీయ మార్కెట్‌పైనా ఈ ప్రభావం ఉన్నదని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ రిసెర్చ్ అనలిస్ట్ దిలీప్ పామర్ అన్నారు.

### వెండి ధగధగలు

బంగారంతోపాటు వెండి రేట్లూ ఎగిశాయి. ఢిల్లీలో కిలో వెండి ధర రూ.1,100 పెరిగి రూ.77,750ని చేరింది. హైదరాబాద్‌లోనైతే ఇది రూ.78,500లుగా నమోదైంది. బుధవారంతో పోల్చితే రూ.1,500 ఎగిసింది. సాధారణ వినియోగదారులతోపాటు పరిశ్రమల నుంచీ పెరిగిన డిమాండే ఇందుకు కారణం అంటున్నారు. అటు అంతర్జాతీయ మార్కెట్‌లోనూ ఔన్సు వెండి 25.51 డాలర్లకు చేరింది.

### ఫ్యూచర్‌లోనూ రికార్డులు..

బంగారం ధరలు ఫ్యూచర్ మార్కెట్‌లోనూ రికార్డులు సృష్టించాయి. ఏప్రిల్ డెలివరీకిగాను 10 గ్రాములు రూ.1,014 లేదా 1.54 శాతం పెరిగి రూ.66,764 పలికింది. ఈ మేరకు 12,067 లాట్లలో బిజినెస్ జరిగింది. స్పాట్ మార్కెట్‌లో రికార్డు ధరలు ప్రభావితం చేసినట్టు మార్కెట్ వర్గాలు చెప్తున్నాయి. న్యూయార్క్‌లో గోల్డ్ ఫ్యూచర్స్ ఔన్సు 2,228.60 డాలర్లుగా నమోదైంది. మరోవైపు వెండి ధరలూ ఫ్యూచర్ మార్కెట్‌లో పెరిగాయి. మే నెల డెలివరీకిగాను కిలో రూ.1,222 లేదా 1.62 శాతం ఎగిసి రూ.76,535 పలికింది. ఈ మేరకు 26,504 లాట్లలో లావాదేవీలు జరిగాయి. న్యూయార్క్ అంతర్జాతీయ ఫ్యూచర్ మార్కెట్‌లోనూ ఔన్సు 25.84 డాలర్లుగా నమోదైంది.

# స్టాక్స్‌కు ఫెడ్ కిక్కు

**లాభాల్లో దేశీయ మార్కెట్లు • ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల కోతల అంచనాలతో జోష్**

ముంబై, మార్చి 21: దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం భారీ లాభాల్లో ముగిశాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ ఈ ఏడాది వడ్డీరేట్లను మూడుసార్లు తగ్గించనుందన్న అంచనాలు.. మదుపరుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. ఈ క్రమంలోనే ఉదయం ఆరంభం నుంచీ సూచీలు పరుగులు పెట్టాయి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 539.50 పాయింట్లు లేదా 0.75 శాతం ఎగిసి 72,641.19 వద్ద ముగిసింది. ఒకానొక దశలోనైతే 780.77 పాయింట్లు పెరిగింది. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ సైతం 172.85 పాయింట్లు లేదా 0.79 శాతం ఎగబాకి 22వేల స్థాయికి ఎగువన 22,011.95 వద్ద స్థిరపడింది. బుధవారం మార్కెట్లు లాభాల్లోనే ముగిసిన విషయం తెలిసిందే.

### రూ.6 లక్షల కోట్లు జూమ్..

స్టాక్ మార్కెట్ల ర్యాలీతో ఈ ఒక్కరోజే బీఎస్ఈ నమోదిత సంస్థల మార్కెట్ విలువ రూ.5.72 లక్షల కోట్లు ఎగబాకింది. రూ.5,72,752.79 కోట్లు అందిపుచ్చుకుని రూ.3,79,85,669.12 కోట్లకు చేరింది.

## హైదరాబాద్‌లో సింజెంటా సీడ్ టెస్టింగ్ ల్యాబ్

హైదరాబాద్, మార్చి 21: వ్యవసాయ ఉత్పత్తుల సంస్థ సింజెంటా..తెలంగాణలో విత్తనాల టెస్టింగ్ ల్యాబ్‌ను ప్రారంభించింది. రూ.20 కోట్ల పెట్టుబడితో 6,500 చదరపు అడుగుల విస్తీర్ణంలో హైదరాబాద్‌కు సమీపంలోని నూతన్‌కల్ గ్రామంలో ఏర్పాటు చేసిన ఈ టెస్టింగ్ ల్యాబ్‌ను కంపెనీ ఆసియా పసిఫిక్ హెడ్ నిశిచింట్ భాఠియా గురువారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..భారత్‌తోపాటు ఆసియా పసిఫిక్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లలో ఇది కూడా ఒకటని వ్యాఖ్యానించారు. 12 వేల వైరస్/బ్యాక్టరియల్ టెస్ట్ చేసే సామర్థ్యం ఈ ల్యాబ్ కలిగివున్నది.

## తెలంగాణలో ష్నైడర్ మరో ప్లాంట్

బెంగళూరు, మార్చి 21: ఎనర్జీ మేనేజ్‌మెంట్ అండ్ ఆటోమేషన్ దిగ్గజం ష్నైడర్ ఎలక్ట్రిక్..వచ్చే రెండేండ్లలో భారత్‌లో రూ.3,200 కోట్ల మేర పెట్టుబడులు పెట్టబోతున్నట్లు ప్రకటించింది. దేశీయంగా తన ఉత్పత్తులను విక్రయించడంతోపాటు విదేశాలకు ఇక్కడి నుంచే ఎగుమతి చేసే ఆలోచనలోఉన్న సంస్థ భారత్‌ను తయారీ హబ్‌గా మార్చేందుకు ప్రణాళికలను వేగవంతం చేసింది. దీంట్లోభాగంగానే బెంగళూరులో రూ.100 కోట్ల పెట్టుబడితో కూలింగ్ సొల్యూషన్స్ కోసం ప్రత్యేకంగా డాటా సెంటర్‌ను ప్రారంభించింది. ఈ సందర్భంగా ష్నైడర్ ఎలక్ట్రిక్ ఇండియా ప్రెసిడెంట్ దీపక్ శర్మ మాట్లాడుతూ..ఈ పెట్టుబడులతో దేశవ్యాప్తంగా పలు ఉత్పత్తులను తయారు చేయడానికి ప్లాంట్లను ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించారు. తెలంగాణతోపాటు మహారాష్ట్ర, కర్ణాటక, గుజరాత్, తమిళనాడు, బెంగాల్, ఉత్తరాఖండ్, ఒడిశాల్లో కొత్తగా ప్లాంట్‌ను నెలకొల్పబోతున్నది. ప్రస్తుతం సంస్థకు దేశవ్యాప్తంగా 30 ఫ్యాక్టరీలు ఉన్నాయి.

## కియా కార్లు ప్రియం

న్యూఢిల్లీ, మార్చి 21: వచ్చే నెల 1 నుంచి తమ వాహన ధరలను 3 శాతం వరకు పెంచుతున్నట్లు కియా ఇండియా గురువారం ప్రకటించింది. కమోడిటీ ఉత్పత్తుల ధరలు పెరగడం, సరఫరా వ్యవస్థలో ఎదురవుతున్న ఇబ్బందులను అధిగమించడానికి సెల్టోస్, సోనెట్, కారెన్స్ వాహన ధరలను పెంచకతప్పడం లేదని కియా ఇండియా నేషనల్ సేల్స్ అండ్ మార్కెటింగ్ హెడ్ హర్దీప్ సింగ్ తెలిపారు. కమోడిటీ ఉత్పత్తుల ధరలు నిరాటంకంగా పెరుగుతుండటం, ఎక్స్ఛేంజ్ రేట్లలో హెచ్చుతగ్గుదలు, ఉత్పత్తి వ్యయం అధికమవడం వల్లనే కొనుగోలుదారులపై భారం మోపాల్సి వస్తున్నదని పేర్కొంది. ఇప్పటి వరకు సంస్థ 11 లక్షల వాహనాలను దేశీయంగా విక్రయించింది.









Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: Thigulla Krishna Murthy. Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.